
"యాలప్పా నన్నిట్ల జేస్తివి? ఏమిటికప్పా నన్నిట్ల నట్టేట్లో ముంచితివి? నిన్ను నమ్ముకుందుకేన ఆ నన్ను ఇన్ని తిప్పలు పెడుతున్నావు? నన్నిట్లా చెయ్యివిడిస్తివేమప్పా రాఘవేంద్రా! ఏనాడైనా పరసొమ్ము కాశపడితినా? నా మీదనా దొంగతనం మోపిరి! ఇదంతా చూస్తా నువ్వేం చేస్తావున్నావు?



# నేరం

సుమ

నీ మొక్కుబడి తీర్చకుండా ఏన్నాడన్నా బాకీ పెడ్తినా? నిన్ను ఎన్నడైనా తలుచుకోకుండా మరిస్తినా? ఏమిటికప్పా నామీద నీకు ఇంత దయమాలింది. ఏమి తప్పు చేస్తి నీకు నేను! ఏనాటి ప్రారబ్దమిది? ఎక్కడ గ్రాచారమిది? అయినింట పుట్టినా, అంతో ఇంతో చదువుకున్నా వేరే బతుకు తెరువు దొరకక వంటలు చేస్తూ బతుకు గడుపుతున్నానే! నామీద వేస్తివా నీ బ్రహ్మాస్త్రం? నేనంత కానివాడినై పోతినా నీకు ? ఎన్ని రోజులైనా సరే! నా మీద నింద పోయేదనుక మంచినీళ్లుకూడా ముట్టను. నీ పాదాలు విడువను. నీవే కాపాడవాలెప్పా రాఘవేంద్రా......!! "

పోలీస్‌స్టేషన్ వరండాలో స్తంభానికి ఆనుకొని కూర్చొని తనలో తాను గొణుక్కుంటున్నాడు అనంతు. మధ్వబ్రాహ్మల పోలికతో ఉన్న పచ్చని మొహంపైన రెండ్రోజులుగా గీయని గడ్డంలో నించి పాకిచెవుల పక్కగా భజాల మీదికి జారుతున్నాయి కన్నీళ్లు. రెండు

## పాఠకులకు మనవి

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సోమవారం మార్కెట్లోకి విడుదలవుతుంది. మీ ఊళ్లో, మీదగ్గరి షాపులో ఆరోజున విడుదల కాకపోతే దయచేసి ఈ కింది చిరునామాకు తెలియచేయండి.

**సీనియర్ సర్క్యులేషన్ మేనేజర్,**
**ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక,**
**ఎక్స్‌ప్రెస్ సెంటర్, లోయర్ టాంక్‌బండ్, దోమల్‌గూడ,**
**హైదరాబాద్-29.**
**ఫోన్: 3223586, 3226058.**

-ఎడిటర్.

మూడు వంకరలు తిరిగిన ముక్కు దుఃఖంతో ఎర్రబడింది. దుబ్బుగా ఉన్న జుట్టు చిందరవందరగా మారి అల్లకల్లోలంగా ఉన్న అతని మనసులా ఉంది. పెళ్లివంట తాలూకు నూనెమరకలతో, కట్టెల మసితో నిండిన అడ్డపంచె, పల్చని ఖద్దరు చొక్కా, అందులోనించి కనిపిస్తున్న మాసిన జందెం, ఇదీ అతని పరిస్థితి.

ఏతుఫానులోనో అయిన వాళ్లందర్నీ పోగొట్టుకున్న వాడిలా ఉన్నాడు అనంతు.

స్వదేశాన్ని వదిలి కానివాళ్ల మధ్యకు వచ్చిన కాందిశీకుడిలాగా ఉన్నాడు అనంతు.

"పొద్దున్నించీ సరిగా భోంచేయనుకూడా లేదు. ఇదో ఇంత కాఫీ అయినా గొంతులో పోసుకోండి. రేప్పొద్దున మీకేమన్నా అయితే ఒక బ్రాహ్మణ్ణి బాధపెట్టిన పాపం మాకు చుట్టుకుంటుంది." అంటూ అతని ఎదురుగా కొంచెం దూరంలో స్తంభానికానుకుని గొంతుకుకూర్చున్నది హైమ.

"నాకేమీ వద్దు తల్లీ ! వద్దు! నా దేవుడు వచ్చి నన్ను విడిపించేదనుక నేను నీళ్లు కూడా ముట్టను. నా తండ్రి రాడా, నన్ను విడిపించడా? ఆయనను తప్ప మరొకర్ని నమ్మలేదు నేను....అప్పా రాఘవేంద్రా!!" ఆకాశంలోకి చూసి దండంపెట్టి కళ్లు మూసుకున్నాడు అనంతు.

"వస్తాళ్లేండి స్వామీ! మీ రాఘవేంద్రుడు! ఆయనకేం పనా పాటా? దొంగపనులు చేసే మీ అట్లా వాండ్ల కోసం ఆయనే దిగి వస్తాళ్లేండి. ముందింత కాఫీ తాగండి" వెటకారంగా అన్నది హైమ.

" బాగా చెప్పినావ్‌లే అమ్మయ్యా! దొంగతనాలు చేసేటోళ్లకు ఈ దేవుడి సాక్ష్యాలొకటి! రెండు తగిలిస్తే దేవుడూ దయ్యం దిగొస్తాదిలే! మాకు తెలీదా నిజాన్ని ఎట్లా కక్కించాల్సిందీ! ఇదో ఇట్లాంటోళ్లను నా ఇంత మందిని చూసినామ్" నెత్తిమీద జుట్టును పట్టుకోని చూపిస్తూ అన్నాడు గోడకానుకుని బీడీ తాగుతున్న పోలీసు కానిస్టేబులు.

చుట్టుపక్కల ఊళ్ల నించి ఖూనీ కేసుల మీద అరెస్టయి ఉన్న తమ వాళ్ల కోసం రకరకాల పనుల మీద వచ్చి ఎస్.ఐ గారితో మాట్లాడటానికి, బేరాలాడడానికీ, ఆయనగారి దయా ధర్మాలకోసం పడిగాపులు కాస్తున్న పల్లెజనం అయిదారుగురు వచ్చి చుట్టూ నిల్చుకోని చోద్యం చూస్తున్నారు.

"అయినా వంటయ్యవారూ! మీరిన్నేళ్లుగా మా ఇంట్లో ఇన్ని పెండ్లిండ్లకు వచ్చి వంట చేస్తిరే! ఎప్పుడూ లేని పాడుబుద్ధి ఈసారెందుకు పుట్టింది చెప్పండి మీకు? చెప్పండి మా వదిన నల్లపూస లెక్కడ దాచిపెట్టినారో!" ఆరాగా అడిగింది ప్రమీల.

"ప్రమీలమ్మక్కా! నాదైవం తోడుగా చెప్తావున్నా నమ్మా! నాకు ఆ నల్లపూసల సంగతి తెలీనే తెలీదు తల్లీ! నన్ను నమ్ము తల్లీ!" దీనంగా చెప్పినాడు అనంతు.

"దైవాలూ, దేవతలూ ఈ కాలంలో ఇంగా ఎక్కడున్నారులే సామీ! చెప్పు....చెప్పు... అమ్మయ్య కోసం తీస్కపోతివా ఏమి? తొందరగా జెప్తే మంచిది చూడబ్బా! లేకపోతే ఈ పోలీసోళ్లు ఊరికేనే ఇడుస్తారనుకున్నావా? చావజంపుతారు. మేమంటే మొరటు కష్టం చేసేటోల్లం. పార్టీల ఎంబడి బడి సస్తావున్నాం. నాలుగు దెబ్బలుతిన్నా ఓర్చుకుంటాం. అసలే ఒంటిపేగుమీన ఉన్నావు. ఒకే దెబ్బకే సచ్చేట్లు. నిజం ఒప్పుకుంటే మంచిది చూడబ్బా...నేను చెప్తావున్నా..." ఖూనీ కేసుతాలూకు రెడ్డి ఒకాయన నీతి చెప్పినాడు.

ఏమీ మాట్లాడలేదు అనంతు.

"ఏమి వంటయ్యవారూ! పలక్కపోతిరి! మీరు గిన చెప్పకపోయినారంటే మా ఆయన జైల్లో పెట్టిస్తాడు చూడండి. నిజం చెప్పేస్తిరా, హాయిగా బతుక్కుంటారు. ఎందుకొచ్చిన దొంగతనం చెప్పండి. అట్లాతిన్న సొమ్ము అరుగుతుందా ఏమన్నానా? అంతకంత అనుభవించవాల్సి వస్తుంది చూడండి మరి!" అంది రమ. పోయిన నల్లపూసల సొంతదారు , గోడకానుకోని వంటాయన కేసి చూస్తూ. కన్నీరు పెట్టుకోవడం తప్ప ఏమీ జవాబుచెప్పలేదు అనంతు. మధ్యలో "నాయప్పా రాఘవేంద్రా ..." అన్న మాటలు తప్ప ఏమీ రావడం లేదు.

"ఈ వంటోళ్లను నమ్మనీకే లేదులే అమ్మయ్యా! ఆ మద్దెన మా ఊళ్లో బాపనోళ్లింట్లో వంటకొచ్చినారు ఈ ఊర్నించే వంటోళ్లు. పెండ్లంతా అయినాక చూసుకుంటే రెండు వెండి తట్టలు కనపళ్లా. ఇంట్లో అంతా ఎతికి సాలించుకున్నారు. పనోళ్లను నిలదీసినారు. వాళ్లెవరూ మాకు తెలీదనిరి. అప్పుడు వాండ్లింటో గాసగాడు బస్సెక్కుతున్న వంటోల్లను ఎనిక్కి పిల్చుకోనొచ్చినాడు. మేమంతా గల్సి వాళ్లను తలకొక చెట్టుకు గట్టేసి చింతబరికలతో వాయించినాం చూడూ ... అప్పుడు కక్కినారు నిజం.. రాత్రి భోజనాల తర్వాత వాళ్లలో ఒకడు వెండి తట్టలను తీస్కపోయి శ్మశానంలో పూడ్చిపెట్టి వచ్చినాడంట. పోయి వాళ్లు చెప్పిన చోట చూస్తే తట్టలు రెండూ ఉన్నాయి. అవిటిని రాళ్లతో కొట్టి ముద్ద మాదిరి చేసినాడు. ఇంగ జూడు, వాళ్లదగ్గర ఉన్న డబ్బులు గుంజుకోని చార్జీకి మాత్రం ఇచ్చిపంపినాం. వంటల ఈశ్వరయ్య అంట ఆవంటోళ్ల హెడ్డు పేరు. మీ ఓళ్లే నా వాళ్లు ?" నాటి తన ప్రతాపాన్ని తల్చుకోని సగం నెరిసిన మీసాలు దువ్వుకుంటూ చెప్పినాడు మరొక రెడ్డి.

ఆ మాటలకు అనంతు ఒళ్లంతా ఒణికింది.

అనంతును చూస్తూ "అవును స్వామీ! నల్లపూసలే దొరికినాయా నీకు? ఏ నెక్లేసో ఎత్తకపోయింటే కొంచెమన్న ఉపయోగం ఉండు గదా! వ్రతం తప్పినా ఫలం దక్కవాలె కదా! దొంగతనం చేసినా చెప్పుకోవడానికి కొంచెం గొప్పగా ఉండేది కదా!" ఈ సారి వేణువంతు.

ఎగతాళి మాటలకు చుట్టూ వున్నవాళ్లంతా ముసిముసినవ్వులు నవ్వుకొనిరి. ఆమాటలకు సమాధానంగా మరిన్ని కన్నీళ్లు వుబికాయి అనంతు కళ్లనుంచి.

అనంతును చూస్తూవుంటే అతనీ దొంగతనం చేసి వుండడనే అనిపిస్తూవుంది రమకు. కానీ పెళ్లింట్లో కలివిడిగా, అతిచొరవగా, ఆడవాళ్లెక్కడుంటే అక్కడికి వచ్చి నిల్చుకోని, వాళ్ల మాటలు వింటూ తనూ హాస్యాలు చేస్తూన్న అనంతును చూసి అందరికీ చికాకుగానే వుండేది. అతని మంచితనాన్ని చూసి ఏమీ

అనలేకపోయేవారు.

***

ఆ రోజు మధ్యాహ్నం నాలుగున్నరకు ఇంట్లో వాండ్లంతా పెండ్లికొడుకువాండ్లను సాగనంపడానికి వీధి చివర ఆగిన బస్సు దగ్గరికి పోయినారు. వాండ్లను పంపించి వచ్చేసరికి తామంతా సూటుకేసులు పెట్టుకునే రూములోనుంచి బయటికి వస్తూ అనంతు కనిపించినాడు. తమను చూసి ఏదో తప్పు చేసినట్టుగా వంటింట్లోకి వెళ్లిపోయినాడు. ఆ తర్వాత సూట్‌కేసు సర్దుతూంటే నగలపెట్టెలో తన నల్లపూసలు కనబడలేదు. ఎన్నిసార్లు వెతికినా .....ఒక్కో చీరను విదిలించి చూసినా కనబల్లేదు. ఇల్లంతా వెతికినారు. మొగమాటం పక్కనపెట్టి బంధువుల పెట్టెలనుకూడా వెతికినారు అనుమానంతో. ఎక్కడా అయిపు లేదు.

అనంతు నడిగితే తానేమీ ఎరగనన్నాడు.

"కానీ నిజంగా వీడి మొహం చూస్తే దొంగమాదిరిగా అనిపించడం లేదే రమా!" అన్నాడు వేణు ఆలోచనగా మొహంపెట్టి.

"ఆఁ... మొహాలపైన వీడు దొంగ, వీడు మంచివాడు అనీ రాసివుంటుందా ఏమన్నా?" అనింది రమ.

ఇంటివాళ్లందరూ, పెళ్లికొచ్చిన బంధువులందరూ అనంతే ఈపని చేసుంటాడని ధ్రువపరిచినారు. దాంతో మరునాటి వరకూ ఇంట్లోనే ఉంచి నిజం బయటికి రాకపోవడంతో, మరునాడు మధ్యాహ్నం అనంతును పోలీస్‌స్టేషన్‌కు తీసుకోనివచ్చి కంప్లైంట్ ఇచ్చినాడు వేణు. ఆరోజంతా అభోజనంగానే ఉన్నాడు అనంతు ఏడుస్తూ. వద్దన్నా వంటచేసి పెట్టినాడు. పోలీసులు వేణుమాటమీద కొట్టకుండా తిట్టకుండా, లాకప్‌లో పెట్టకుండా ఊరికే వరండాలో కూర్చోబెట్టినారు. వాళ్లకూ తెలుసు...ఇటువంటి కేసుల్లో నిజాలు నిదానం మీదగానీ నిగ్గుతేలవని!

***

"ఏమంట? చెప్పడంటనా?" వ్యంగ్యంగా అన్నాడు వేణు, అప్పటిదాకా లోపల ఎస్.ఐతో ఏదో మాట్లాడివచ్చి.

"ఈనెక్కడ జెప్తాడూ! అమ్మపెట్టేవి రెండూ పెడ్తేగాని పలుకు వచ్చేనా?" అంది రమ అనంతు వైపు చూస్తూ...

"అంతగాక..." వంతపాడింది ప్రమీల.

"అప్పా..... అప్పా.....రాఘవేంద్రా!"

"చెప్పు వంటయ్యవారూ! నీక్కావలసింది డబ్బే అయితే ఇంకొంచెం అడిగివుండవచ్చునే! లేకపోతే అడుక్కోవలె గానీ ఈ పనులు తప్పు స్వామీ! నీకేమన్నా అంత అవసరం వుంటే నన్నడక్కపోతివా? పోనీ నేనియ్యలేకపోతే అప్పుగానైనా ఇప్పిస్తుంటి కదప్పా!" అన్నాడు వేణు అనంతు దగ్గరగా నిల్చుకోని.

డబ్బున్న వారి తరఫునే న్యాయం ఉంటుందన్న విషయం అనంతుకు బాగా తెల్సు. అయినా మరొకసారి తన బాధను చెప్పుకుందామన్నట్లుగా -

"అన్నా! నీకో దండం పెడ్తా.. నాకేం తెలీదన్నా!" మొత్తుకోవడం అన్న పదానికి అర్థంలా చెప్పినాడు అనంతు.

"మరి ఆ రోజు సామాన్లున్న రూములోకి ఎందుకొచ్చినట్టు? అయినా ఆ టైమ్‌లో ఎందుకొస్తివి? నువ్వు ఇంట్లోకొచ్చి పోయినంకనే కదా వస్తువు కనబల్లేదు. అంటే యేమనుకోవాలె చెప్పు" ఆరా తీస్తూ అన్నాడు వేణు.

"అన్నా...సత్తెంగా చెబ్తావున్నా... నీవైనా నన్ను నమ్మా, రాత్రి వంటలోకి ఏం చెయ్యాల్నో అడుగుదామని ఇంట్లోకొచ్చినా. ఎవురూ లేరు. పోనీ ఆ సామాన్లరూములో ఎవురన్నా ఉన్నారేమో చూతామని తొంగి చూస్తి. ఎవురూ కనబల్లా. అందుకే వెనిక్కి వచ్చేస్తి. అప్పుడే వదినమ్మ వస్తూ కనిపించె. ఇంతకంటె నాకేం తెల్దన్నా.. నా బిడ్డల సాక్షిగా చెప్తావున్నా... తలపగలకొట్టుకుందునా? నిప్పుల్లో దూకుదునా? ఏం చేస్తే నా మీద నీకు నమ్మకం కుదురుతుంది చెప్పు?" బాధగా, ఆవేశంగా అనంతు చెప్పాడు.


"ఇదేమన్నా సత్తెకాలమా? నిప్పుల్లో దూకడానికీ, నీళ్లమీద నడవడానికీ... సరే! నువ్వు మంచిమాటలకు లొంగకుండా వున్నావు. రేపు పోలీసులు కొట్టినప్పుడైనా చెప్పకపోతావా? నీ ఇల్లు సోదా చేస్తేనన్నా దొరక్కపోతుందా? రేపు కోర్టులో వచ్చి సాక్ష్యం చెప్పడు నీ దేవుడు? నీ అట్లావాళ్ల చేతుల్లో పడితే ఆ దేవుడిపేరు కూడా అపవిత్రమైపోతుంది" కళ్లు ఎర్రగా చేసుకోని తీవ్రంగా అన్నది ప్రమీల.

గడగడ ఒణికిపోయినాడు అనంతు.

ఇంతలో నాగరత్నమ్మ వచ్చింది రిక్షా దిగి. ఆమెను చూడంగానే కష్టంలో ఉన్నప్పుడు ఆప్తులను చూసినట్లు ఏడ్చాడు అనంతు మొహానికి చేతులు కప్పుకోని...

అతనికి దగ్గరగా వచ్చి కూర్చుంది నాగరత్నమ్మ. ఆమె చేతులు రెండూ పట్టుకున్నాడు. కళ్లకు అన్నుకున్నాడు. గొంతులో ముడిపడిన దుఃఖం అనంతుని మాట్లాడనీయలేదు.

'అక్కా' ఎట్లనో గొంతు పెగుల్చుకున్నాడు. అతని కన్నీటితో ఆమె చేయి తడిసిపోయింది.



**ఖాళీదే!**

శీను: "నా పర్స్ ఎవరో దొంగవెధవ కొట్టేశాడోయ్" అన్నాడు కోపంగా శేఖర్‌తో.

శేఖర్: "అనవసరంగా తిట్టకు?" వారిస్తూ అన్నాడు.

శీను: "ఏం...ఎందుకని?"

శేఖర్: "అది ఖాళీదేగా!" చెప్పాడు.

**చందూ వంశీ**, నంద్యాల

"ఏమి నాయనా చెప్పు! బాధపడవాక! "

ఆ మాత్రం ఓదార్పు కొసరంత ధైర్యాన్ని తెచ్చిపెట్టింది. దుఃఖాన్ని మింగుకుంటూ ..."అక్కా! చెప్పక్కా .....ఇన్నాళ్లు మీ ఇంట్లో ఇన్ని కార్యాలకు వంట చేస్తినే! ఎప్పుడైనా ఒక్క చెంచా అయినా పోయిందాక్కా! ఇప్పుడు నల్లపూసల దండ దొంగిలిచ్చినానని అంటున్నారే! న్యాయమేనా?"

ఆమెభుజం మీదికి వాలిపోయినాడు అనంతు.

"ఎన్నడూ ఏమీ చెయ్యలా నివ్వు.. అందుకే గదా నిన్ను పట్టుకోని వుండేది? ఇన్ని కార్యలపట్ల జరగనిది ఈ సారెట్లా జరిగింది నాయనా?" ఆమె కంటా కన్నీళ్లు...

తుళ్లిపడి ఆమె చేతులను విడిపించుకున్నాడు. "అయితే నువ్వూ నన్ను దొంగా అంటున్నావాక్కా! నువ్వుకూడా అట్లే అంటే చెప్పేదేముంది? అయినా ఆయప్పకే దయమాలిన తర్వాత మీరంతా అన్నారని ఎందుకు బాధపడవాలె? ఎట్లయ్యేది అట్లనే కానీ!" అంటూ ధైర్యం తెచ్చుకోని కూర్చున్నాడు అనంతు. అంతలోనే దుఃఖం... అంతలోనే ధైర్యం...

"వేణూ! పోతే పోనీలేరా నల్లపూసలు... ఇంకోసారి చేయించుకోవచ్చు.. సాటి బ్రాహ్మణ్ని ఘోష పెడితే మనకేం మంచిది చెప్పు?" కొడుకు వైపు బతిమాలుతున్నట్టుగా చూసింది నాగరత్నమ్మ.

"అయినా రమా! నీవెందుకు తీసిపెట్టినావే నల్లపూసలు? ఎప్పుడూ వేసుకోనే ఉండేదానివి కదా!" కోడలు వైపు చూస్తూ కొంచెం విసుగ్గా అనింది నాగరత్నమ్మ, దీనికంతా నీవే కారణం అన్నట్టు .

"మీరే చూడండి. మెడనిండా ఎన్ని చెమటకాయలో! ఆ బాధ భరించలేకే తీసిపెట్టినా?.." చెప్పింది రమ కాస్త నిష్ఠూరంగా.

" ఇంక ఇంటికన్నా పోదాం పదండమ్మా! పొద్దుపోయింది. ఇంట్లో చుట్టాలంతా ఉన్నారు." అనింది నాగరత్నమ్మ.

"ఈనేం తినడంట.. తాగడంట.. మంచినీళ్లు కూడా ముట్టడంట...ఏమన్నా అవుతాడేమోనే!" అనింది ప్రమీల తల్లితో.

స్తంభానికి ఆనుకోని సొమ్మసిల్లినట్టున్న అనంతు దగ్గరికి జరిగి "అనంతా, ఇంటినించి ఇంత ఉప్మా పంపిస్తారా, తిను. నువ్వు చేసిన వంట మేమంతా తింటూ, నువ్వు పస్తు వుండడం మాకేమన్నా బాగుంటుందా చెప్పు?"

"వద్దక్కా... నాకేమొద్దు! వంటవాండ్ల బతుకులెపుడూ ఇంతే కదా! ఊరికంతా వండిపెట్టి, అన్నం సయించక మజ్జిగ తాగి పండుకోవడం మాకు అలవాటే కదక్కా! మీరు పోండి. ఇంటినిండా జనం ఉన్నారు. నా మీద నిందపోతేగానీ భోయనం చేయనని ఒట్టేసుకున్నా ... ఆయప్ప కన్ను తెరవ్వాలె.. నా మీది మాట పోవాలె. అప్పుడే మంచినీళ్లు ముట్టేది" నిశ్చయంగా చెప్పినాడు అనంతు.

అందరికీ భయం వేసింది అనంతు నిర్ణయం విని. ఏదో ఒకటి తెలిస్తే ఫర్వాలేదు. లేకపోతే....

***

ఆ రోజు ఎవ్వరికీ అన్నం సయించలేదు. మరుసటి రోజు ఉదయం భోంచేసి బంధువులంతా వెళ్లిపోయినారు. ఇంటివాళ్లు మాత్రమే మిగిలినారు. అప్పుడు ప్రమీల వచ్చి పిల్లను ఒళ్లో వేసుకుని నిద్ర పుచ్చుతున్న రమ ఎదురుగా వచ్చి కూర్చుంది.

"ఒదినా! నీకు అసలే జ్ఞాపకశక్తి తక్కువ. అన్నీ ఎక్కడో పెట్టి ఎక్కడో వెతుకుతావు. ఇంకోసారి నీ సామాను వెతికి చూడు తల్లీ ! అవతల ఆ వంటవాడి ప్రాణం పోతావుంది." కఠినత్వం ఆ మాటల్లో.

"చూడు తల్లీ ఈసారి నీవే వెతుకు." విసురుగా అంటూ తన సామాన్లన్నీ తెచ్చి ప్రమీల ముందు పడేసింది రమ.

ప్రమీల ఒక్కో చీర, పిల్లల బట్టలు, పొంట్లు, షర్టులు దులపడం మొదలుపెట్టింది. రమ చిరాగ్గా చీరలన్నీ మడత పెట్టి పక్కన పెట్టుకుంటోంది.

"ఇదుగో.. ... ఇక్కడే పెట్టుకుని పోయిందని అనవసరంగా ఆ బ్రాహ్మణ్ని పోలీసులకు పట్టిస్తిమి. అంటూ సూట్‌కేస్ అడుగున ఉన్న నల్లపూసల దండను పైకి తీసి చూపించింది ప్రమీల.

"ఆరోజు సూట్‌కేస్ బోర్లించి దులిపినానే! మీరంతా చూస్తిరి మీ కళ్లతో." అంది రమ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికన్నట్టుగా...

"అవునమ్మా! ఆ రోజు అదీ చూస్తిమి. ఈ రోజు ఇదీ చూస్తున్నాము. అయినా నీకు గ్యాపకం తక్కువేనే! పాపం ఆ బ్రాహ్మణ్ని అట్లా పోలీసుల పాలుజేస్తిమి! ఎంత పాపం మూటకట్టుకుంటిమి? అంతా నీవల్లే! సూట్‌కేసుకు బీగం వేసుకోవు. కొంచెం కూడా జాగ్రత్తలేదు. పైన అందరిపైనా అనుమానాలు! చుట్టాలంతా ఏమనుకునిరో ఏమో! సిగ్గు విడిచి వాళ్ల పెట్టెలుకూడా వెతికితిమి........" అట్లా సాగిపోయింది ఆమె ధోరణి. అది ఒక అరగంటవరకు సాగింది. మధ్యలో ఇంట్లో చిన్న నుంచి పెద్దవరకు అందరూ తలో మాట అన్నారు...వేణుతప్ప.... ఆమెనూ నోరెత్తనివ్వలేదు.

రమ కళ్లనీళ్ల పర్యంతం అయిపోయింది. వేణు మౌనాన్ని ఆశ్రయించాడు. పోలీస్ స్టేషన్‌కు పరిగెత్తాడు వేణు.

***

"ఏమండీ! అసలు నల్లపూసలు ఎట్లా పోయినాయో, ఎట్లా దొరికినాయో నాకేమో అంతా గారడిగా అనిపిస్తా వుందండీ.. నేనే అందరి ముందూ వెతికితే కనబడని నల్లపూసలు ఆమె వెతికితే ఎట్లా కనిపించినాయంటారూ!" అంతవరకూ బస్సు కిటికీలోనించి బయటికి చూస్తున్న భర్తనడిగింది రమ.

"అవన్నీ ఎందుకు రమా! దొరికింది కదా! మన వస్తువు గట్టిది. ఆ మాట విడిచిపెట్టు." ఒళ్లో నిద్రపోతున్న పిల్లవాణ్ని సర్దుకుంటూ అన్నాడు వేణు కొంచెం సీరియస్ మొహం పెట్టి.

రమ భర్తవైపు అట్లా చూస్తూండిపోయింది. అతని మొహంలో భావాలు చదవడానికన్నట్లుగా.

"తప్పెవరిదైతే నేమి? మధ్యలో ఆ వంటయ్యవారు నానా మాటలూ పడినాడు. " గొణుగుతున్నట్లుగా అన్నాడు వేణు నిద్రపట్టించుకోవడానికి ప్రయత్నిస్తూ....

అన్యాయంగా మాటలు పడిన వంటయ్యవారికి, తనకూ ఏమీ తేడా కనిపించలేదు రమకు. ■